## క్లుప్తంగా

### పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో భీమేశ్వరస్వామి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో స్వామి వారికి ప్రీతైన సోమవారం, వైశాఖ శుద్ధ పాడ్యమి కావడంతో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి ప్రీతైన రోజు కావడంతో ఆలయంలోనూ, ఉప ఆలయాలోను అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి తొలి అభిషేకం తిలకించడానికి క్యూలైనులో భక్తులు బారులు తీరారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఉదయం పులిహోర ప్రసాదం, మధ్యాహ్న అన్నప్రసాదం, సాయంత్ర శనగలు, పులిహోర ప్రసాదంగా ఏర్పాటు చేశారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లకి రాజగోపాలశర్మ, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్, చెరుకూరి రాంబాబు, సన్నిదిరాజు వెంకన్నలు పూజాధికార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు.

### పెద్దాపురం వాసులకు గిన్నిస్ బుక్‌లో స్థానం



గిన్నిస్ బుక్‌లో స్థానం సాధించిన పెద్దాపురం పట్టణ వాసులు

పెద్దాపురం: పట్టణానికి చెందిన ముగ్గురు వ్యక్తులు సంగీతంలో గిన్నిస్ బుక్‌లో స్థానం సాధించారు. పెద్దాపురానికి చెందిన దాస్యం కిషోర్, దాస్యం మేరీ వర్ధన, నూకతట్టు ప్రసన్న కుమార్‌తో పాటు మండలంలోని కట్టమూరు గ్రామానికి చెందిన కొత్తపల్లి జీవరత్నకుమార్ గిన్నిస్ వరల్డ్ రికార్డులో స్థానం లభించింది. ఈ నెల 25వ తేదీన విజయవాడ మెట్రో పాలిటన్ చర్చిలో జరిగిన కార్యక్రమంలో రికార్డ్ సర్టిఫికెట్లు అధికారుల చేతుల మీదుగా అందుకున్నారు. ప్రపంచ స్థాయి సంగీత కార్యక్రమంలో 18 దేశాల నుంచి శిక్షణ పొందిన మొత్తం 1090 మంది విద్యార్థులు ఎలక్ట్రానిక్ కీ బోర్డుపై 45 సెకండ్స్‌లో మూడు సరళి స్వరాలు ప్లే చేసి గంటలో ఇన్‌స్టా గ్రామ్‌లో అప్‌లోడ్ చేయగా 1046 మంది విద్యార్థులు అర్హత సాధించారు. వారిలో పెద్దాపురం నుంచి నలుగురు గిన్నిస్‌లో స్థానం సాధించంపై పలువురు అభినందించారు.

### ఉపాధి హామీ పనుల ప్రారంభం



హుస్సేన్‌పురంలో పనులు చేస్తున్న కూలీలు

సామర్లకోట: ఇటీవల పంచాయతీలో నిర్వహించిన ఉపాధి హామీ గ్రామ సభల మేరకు ఉపాధి హామీ పనులు మంజూరైనట్టు హుస్సేన్‌పురం గ్రామ సర్పంచ్ మార్ని నాగమణి తెలిపారు. గ్రామంలో ఉపాధి హామీ పనులను సోమవారం ఆమె ప్రారంభించారు. గ్రామంలో లింకు రోడ్లు, పంట కాలువలు తుప్పలతో నిండి ఉండడం వల్ల తుప్పలు తొలగింపునకు ప్రాధాన్యమిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్ని సూర్యారావు, గ్రామ నాయకులు చల్లా బుజ్జి, కోట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

### నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పెద్దాపురం: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి తెలిపారు. సోమవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 10.30 గంటలకు మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన జరుగుతుందన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు, కౌన్సిల్ సభ్యులు, ఆయా విభాగాల మున్సిపల్ అధికారులు తప్పక హాజరుకావాలని ఆమె కోరారు.

### క్యాన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం



ఆర్థిక సహాయం అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

కొత్తపల్లి: పొన్నాడ శివారు కోనపాపపేటకు చెందిన పి.పావని గత కొంత కాలంగా బ్లడ్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమెకు ఏబీఆర్ ఫౌండేషన్ ద్వారా వీవీఎస్ పాఠశాల ప్రిన్స్‌పాల్ ధనలక్ష్మి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు.

# రొచ్చుబండ..!





కళాశాల ఆవరణలో పేరుకుపోయిన చెత్త చెదారం



పాఠశాలలో నాటిన మొక్కల చుట్టూ చేరిన చెత్త

- అధికారుల నిర్లక్ష్యంతో అపారిశుధ్యం
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

పిఠాపురం: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేస్తున్నామంటూ ప్రకటించిన రచ్చబండ కార్యక్రమం సమస్యల సేకరణ లేకపోగా కొత్త సమస్యను తెచ్చిపెట్టింది. పిఠాపురం ఆర్ఆర్‌బీ హెచ్ఆర్ కళాశాల ప్రాంగణంలో గత 25వ తేదీన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తున్నారఅంటూ అధికారులు ఏర్పాటు చేశారు. అయితే అనూహ్య పరిణామాలు నేపథ్యంలో ఆ కార్యక్రమం అర్ధాంతరంగా రద్దయింది. రచ్చబండ కార్యక్రమం ఏర్పాటులో భాగంగా అధికారులు చేసిన ఏర్పాట్లలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరు పోయాయి. కార్యక్రమాన్ని రద్దు చేసిన అధికారులు ఆ పరిసరాలను శుభ్రం చేయడంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపణ వినిపిస్తున్నాయి. గత మూడు రోజులుగా చెత్తను తొలగించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ఇదే కళాశాల ప్రాంగణంలో విద్యార్థులు క్రీడ వేసవి శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ప్రాంగణమంతా చెత్తతో నిండిపోవడంతో ఆటాడుకోవడానికి ఇబ్బందిగా ఉందంటూ విద్యార్థులు వాపోతున్నారు.

### భోజనం బల్లల బహూకరణ



సేవా సంఘానికి భోజన బల్లలు బహూకరిస్తున్న కామేశ్వరశర్మ

పిఠాపురం: స్థానిక వైఖానస సేవా సంఘానికి తన కుటుంబ సభ్యుల సహకారంతో పట్టణానికి చెందిన రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయుడు రాయప్రోలు వీఎస్ కామేశ్వర శర్మ సుమారు రూ.10 వేల విలువ గల ఐదు భోజనం బల్లలను సమకూర్చారు. వాటిని సంఘం సభ్యుడు విజయ జనార్దనాచార్యులుకు సోమవారం అందజేశారు.

### డాక్టర్ విఠల్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా ఆర్థోపెడిక్స్ హెచ్‌ఓడీ డాక్టర్ ఎం.పాండురంగ విఠల్‌కు ఇన్‌చార్జి హోదాలో పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సోమవారం ఈ ఉత్తర్వులు అందాయి. తాజా ఉత్తర్వుల నేపథ్యంలో డాక్టర్ విఠల్‌కు కీలకమైన చెక్ పవర్ సంక్రమించింది.

## పాపిడిదొడ్డి చెరువులో మట్టి తీయవద్దు



ఇరిగేషన్ ఈఈకు వినతిపత్రం అందజేస్తున్న ఎఫ్‌కే పాలెం, విరవాడ గ్రామస్తులు

పిఠాపురం: మండలంలోని ఎఫ్‌కే పాలెం, విరవాడ గ్రామ సరిహద్దులో సర్వే నెం-17లో నీటి వనరుల కింద 38.27 ఎకరాల పాపిడిదొడ్డి చెరువులో పూడిక తీయవద్దని ఎఫ్‌కే పాలెం గ్రామస్తులు పాలిక సతీష్, గ్రామ పెద్దలు పెద్దాపురం ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ చెరువు కింద సుమారు 160 ఎకరాల భూమి ఈ చెరువుపై వ్యవసాయం చేసుకొని రైతులు ఆధారపడి ఉన్నారన్నారు. దీనిపై సుమారు 200 మంది వ్యవసాయ అవసరాలకు, ఉపాధి హామీ కూలీలు జీవిస్తున్నారు. ఈ చెరువులో పూడిక తీత పేరుతో ఇటీవల మట్టిని తరలించేందుకు గత నెల తీవ్రంగా ప్రయత్నించారు. అప్పట్లో గ్రామస్తులు, తాము జేసీబీని, మట్టి మాఫియాదారులను అడ్డగించామని తెలిపారు. ఇప్పుడు మళ్లీ నీటి సంఘం పేరుతో నీటిసంఘం అధ్యక్షుడు ద్వారా తీర్మానం చేసి మీ దృష్టిలో పూడిక తీత పేరుతో ఇటుక బట్టీలకు మట్టిని తరలించుకుపోయేందుకు ప్రయత్నిస్తున్నారని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. మట్టి మాఫియా రైతుల పేరుతో అనుమతులకు ప్రయత్నిస్తున్నారని, వీటిని ఎట్టి పరిస్థితుల్లో అనుమతించవద్దని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు.

## గ్రామకంఠం భూమిని రక్షించండి

కలెక్టర్‌కు గ్రామస్తుల ఫిర్యాదు



గ్రామ కంఠంగా చెబుతున్న భూమి

సామర్లకోట: హుస్సేన్‌పురం గ్రామంలో ఉన్న గ్రామ కంఠం భూమిని కొంత మంది భూస్వాములు ఆక్రమించి ప్లాట్లుగా విక్రయించడానికి ప్రయత్నం చేస్తున్నారని ఆ భూమిని రక్షించాలని సోమవారం ఆ గ్రామ ప్రజలు కాకినాడలో జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆ గ్రామస్తులు ఎస్వీ రమణ, ఐ.అచ్చారావు, బి.శ్రీను, ఎస్.వెంకటరమణ ఫిర్యాదులు చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ మండల ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అచ్చారావు మాట్లాడుతూ గ్రామ కంఠం(ప్రభుత్వ) భూమిని కొంత మంది ఆక్రమణదారులు జిరాయితీ భూమిగా పెత్తనం చేస్తున్నారని ఆరోపించారు. జగ్గమ్మగారిపేటకు చెందిన సర్వే నంబరు 154లో 11 ఎకరాల విస్తీర్ణంలో గ్రామ కంఠం ఉందని చెప్పారు. ఈ భూమిని ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇళ్ల స్థలాలుగా అమ్మకం చేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. గ్రామ కంఠం భూమిని కొంత మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై చర్యలు లేకపోతే ప్రభుత్వ భూమి అనేది లేకుండా ఆక్రమించుకుంటారని వారు తెలిపారు. దీనిపై చర్యలు తీసుకొని ప్రభుత్వ భూమికి రక్షణ కల్పించాలని జిల్లా కలెక్టరుకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొనట్లు తెలిపారు.

## సమస్యల పరిష్కారానికి పీజీఆర్ఎస్



పీజీఆర్ఎస్‌లో అర్జీ స్వీకరిస్తున్న పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న తలుపులమ్మ కాలనీవాసులు

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి వారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి అన్నారు. ఈ గ్రీవెన్స్ కార్యక్రమంలో భాగంగా డివిజన్‌లో ఆయా మండలాల నుంచి ఐదు అర్జీలు అందినట్లు ఆమె తెలిపారు. అనంతరం ఆర్డీఓ శ్రీరమణి స్థానిక విలేకరులతో మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి సమస్యను పరిష్కంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఆయా అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులకు ఆదేశించినట్టు ఆర్డీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఏఓ మాధవరావు, డీటీ భానుకుమార్, సీడీపీఓ ఉష, గృహ నిర్మాణ శాఖ రవిశంకర్, అధికారులు పాల్గొన్నారు.

**మేజర్ డ్రైన్‌లో పూడికతీత పనులు చేపట్టండి**

పెద్దాపురం: పట్టణంలోని తలుపులమ్మ కాలనీలో మూసుకుపోయిన మేజర్ డ్రైన్‌లో పూడికతీత పనులు చేపట్టాలని వార్డు ప్రజలు సోమవారం మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతిని కోరారు. గత కొన్ని రోజులుగా కాలువ పూడికతీయక మురుగు వెళ్లే మార్గం లేకుండా పోయిందన్నారు. దీనివల్ల దుర్వాసన వెదజల్లుతోందని, రోగాల బారిన పడుతున్నామన్నారు. సత్వరమే పూడికతీత పనులు చేపట్టాలని వార్డు ప్రజలు కోరారు.

**ట్రాఫిక్ సమస్యను పరిష్కరించండి**

పిఠాపురం: పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని పిఠాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పాడా) చైర్మన్‌కు పిఠాపురానికి చెందిన బొజ్జా కుమార్ గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశారు. పిఠాపురం పట్టణం ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోంది. దేశ విదేశాల నుంచి వేలాది మంది పట్టణంలో ఉన్న ఆలయాలను దర్శించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పిఠాపురంలో వన్‌వే ఉన్నప్పటికీ ప్రజలు సరైన నిబంధనలు పాటించకుండా అడ్డదిడ్డంగా ప్రయాణించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందన్నారు. ఈ విషయంపై విచారించి పట్టంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేసి, ట్రాఫిక్ క్రమబద్ధీకరించాలని ఆయన పాడా చైర్మన్‌ను కోరారు.

**పాడా గ్రీవెన్స్‌కు 87 అర్జీలు**

పిఠాపురం: స్థానిక పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (పాడా)లో పీజీఆర్ఎస్ (గ్రీవెన్స్)ను పాడా ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.చైత్రవర్షిని ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రీవెన్స్‌కు ప్రాజెక్టు డైరెక్టర్, పాడా, ఏపీడీ, డ్వామా, మున్సిపల్ కమిషనర్, ఇతర మండలస్థాయి అధికారులు హాజరయ్యారు. ఈ గ్రీవెన్స్‌కు 87 అర్జీలు అందాయి. వీటిలో రెవెన్యూ-30, మునిసిపాలిటీ-41, ఇతర అర్జీలు -16 వచ్చినట్టు పీడీ చైత్రవర్షిణి తెలిపారు.

## వెంకటరెడ్డికి మాజీ ఎంపీ గీత పరామర్శ



పెనుమల్లు వెంకటరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గీత

కొత్తపల్లి: నాగులాపల్లికి చెందిన పెనుమల్లు వెంకటరెడ్డి సతీమణి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈ మేరకు అతనిని మాజీ ఎంపీ, పిఠాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇంచార్జి వంగా గీత పరామర్శించి ప్రగాడ సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో మండల వైఎస్సార్ సీపీ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, ఎరకం ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ అనిశెట్టి సుభాషిణీ, ఎరకం దివాకర్‌రెడ్డి, కూతా నాగిరెడ్డి, బుచ్చిరెడ్డి, పిఠాపురం పట్టణ అధ్యక్షుడు రావుల మాధవరావు, కొత్తెం దత్తుడు ఉన్నారు.

# రేపు కౌన్సిల్ సాధారణ సమావేశం



సామర్లకోట మున్సిపల్ కార్యాలయం

సామర్లకోట: ప్రతి నెలా నిర్వహించే మున్సిపల్ పాలక మండలి సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన జరిగే సమావేశంలో పట్టణ పరిధిలో అభివృద్ధి పనులకు సంబంధించి చర్చించడానికి 28 అంశాలతో అజెండా తయారు చేశారన్నారు. ఈ సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, ఆయా శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

**కౌన్సిల్ సమావేశం జరిగేనా!**

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఈ నెలలో ఏవిధంగా జరుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్టు ఫిర్యాదుల మేరకు ఈనెల 3వ తేదీన వైఎస్సార్ సీపీ కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు వచ్చిన విషయం విధితమే. కాగా ఈనెల 2వ తేదీన మున్సిపల్ చైర్‌పర్సన్‌పై బలనిరూపణకు అవకాశం ఇవ్వాలని 22 మంది సభ్యులు సంతకాలు చేసి మున్సిపల్ కమిషనర్, కలెక్టరుకు వినతి పత్రాలు అందజేసిన విషయం తెలిసిందే. గత నెలలో వైఎస్సార్ సీపీ సభ్యులు కౌన్సిల్ సమావేశం నుంచి వాకౌట్ చేశారు. ఈ మేరకు బలనిరూపణకు సంతకాలు చేసిన కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశానికి హాజరయ్యే అవకాశం కనిపించడం లేదు. 31 మంది సభ్యులు ఉన్న కౌన్సిల్‌లో ఇద్దరు టీడీపీకి చెందిన వారు కాగ మిగిలిన 29 మంది వైఎస్సార్ సీపీ నుంచి ఎన్నిక అయ్యారు. వీరిలో 26వ వార్డు కౌన్సిలర్ నక్కా లలిత అనారోగ్యంతో మృతి చెందారు. సర్వత్రి ఎన్నికల ముందు ఇద్దరు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు టీడీపీలోనికి చేరారు. దాంతో టీడీపీ బలం 4కు చేరింది. బల నిరూపణ పత్రంపై దవులూరి పార్వతితో పాటు కాళ్ల శ్యామల, చలపల్లి వెంకటసత్యనారాయణలు సంతకాలు చేయలేదు. 27వ వార్డు నుంచి గంగిరెడ్డి అరుణ కౌన్సిలర్‌గా ఎన్నిక అయ్యారు. ఊహించని పరిణామాల మధ్య ఆమెకు చైర్‌పర్సన్‌గా అవకాశం దక్కింది. చైర్‌పర్సన్‌ను మార్పు చేయడానికి మెజార్టీ సభ్యులు పట్టుదలతో ఉన్నారు.

# విద్యార్థుల్లో ప్రతిభకు శిక్షణలు దోహదం



సామర్లకోట గ్రంథాలయంలో విద్యార్థులకు సమ్మర్ శిక్షణ ప్రారంభం



ఉప్పాడలో నిర్వహించిన వేసవి శిబిరంలో మాట్లాడుతున్న రిసోర్స్ పర్సన్ పైడిరాజు

సామర్లకోట: విద్యార్థులలో ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న శిక్షణలు ఎంతగానో దోహదపడతాయని గ్రంథాలయాధికారి బి.రత్నమణి అన్నారు. స్థానిక గ్రంథాలయంలో సోమవారం నుంచి జూన్ 6వ తేదీ వరకు నిర్వహించే వేసవి విజ్ఞాన శిక్షణను ఆమె ప్రారంభించారు. విద్యార్థులు సెలవు రోజులలో సెల్‌ఫోన్‌లతో గడపకుండా ఆటలపై దృష్టి సారించడం ద్వారా వారిలో ఉన్న ప్రతిభను గుర్తించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు ఈ రవికుమార్, వై కామేశ్వరరావు, ఎస్ సూర్య ప్రకాష్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్ని ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకూ కథలు చెప్పడం, చదవడం, పెయింటింగ్, డ్రాయింగ్, చెస్ వంటి అంశాలపై శిక్షణలు ఇచ్చారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ గ్రంథాలయాలలో ఎంతో విలువైన పుస్తకాలు ఉంటాయని వాటిని చదవడం ద్వారా విజ్ఞానం పెరుగుతుందన్నారు. ప్రతిరోజు కనీసం రెండు గంటలు గ్రంథాలయంలో గడిపే అలవాటును చిన్నతనం నుంచి నేర్చుకోవాలని వారు సూచించారు.

**వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభం**

కొత్తపల్లి: ఉప్పాడలోని గ్రంథాలయాల్లో సోమవారం నుంచి వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరాలను గ్రంథాలయ అధికారులు టి.నళినీ ప్రియ, తుమ్మలపల్లి జయకృష్ణ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ శిబిరాలు జూన్ 6వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్ టి.పైడిరాజు మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరాలు ముఖ్య ఉద్దేశం విద్యార్థుల భావాలను వ్యక్తీకరించడానికి ఉపయోగపడతాయి. విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యతను వెలికి తీయడానికి ఈ గ్రంథాలయాలు వేదిక అయ్యాయన్నారు. ఈ శిబిరంలో వేసవి విజ్ఞాన శిబిరంలో వివిధ రకాల కళలు, చిత్రలేఖనం, స్పోకింగ్ ఇంగ్లీషు నేర్చుకునుట, అక్షరాలతో చిత్రాలు గీయడం, జనరల్ మ్యాథమెటిక్స్, యోగా నేర్పించనున్నట్టు తెలిపారు.

# ఎన్‌సీసీతో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు



ఫైరింగ్ శిక్షణ పొందుతున్న ఎన్‌సీసీ విద్యార్థులు

పెద్దాపురం: ఎన్‌సీసీతో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు దేశభక్తితో పాటు సమాజంలోని సమస్యలపై అవగాహన పెరుగుతుందని బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్, క్యాంప్ కమాండెంట్ మేజర్ కె.మహ్మద్ అసీఫ్ అన్నారు. స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో ఎన్‌సీసీ వార్షిక శిక్షణా శిబిరంలో భాగంగా సోమవారం వాలీబాల్, రైఫిల్ షూటింగ్ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆసీఫ్ మాట్లాడుతూ 18వ బెటాలియన్ కాకినాడ ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ వరకు శిక్షణా శిబిరం నిర్వహిస్తారన్నారు. ఈ శిబిరంలో ఫైరింగ్, వెపన్ ట్రెనింగ్, బాటిల్ ఫీల్డ్ అండ్ ఫీల్డ్ క్రాఫ్ట్, టెన్త్ పిచ్చింగ్, హెల్త్ అండ్ హైజీనో తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సుబేదార్ మేజర్ ఆఫీసర్ హేమంత్‌కుమార్, లెఫ్టినెంట్ సత్యనారాయణ, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

# సోలార్ విద్యుత్ యూనిట్ల ఏర్పాటుకు రుణాలివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన ద్వారా రూఫ్ టాప్ సోలార్ విద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేసుకునే లబ్ధిదారులకు రుణాల కల్పనకు బ్యాంకులు చొరవగా ముందుకు రావాలని కలెక్టర్ షణ్మోహన్ సగిలి కోరారు. సోమవారం మధ్యాహ్నం కలెక్టరేట్ కోర్టు హాలులో కలెక్టర్ వివిధ బ్యాంకులు, విద్యుత్, డీఆర్‌డీఏ, డ్వామా అధికారులతో సమావేశం నిర్వహించి పీఎం సూర్యఘర్ యోజన, ఉపాధి హామీ కూలీలకు పీఎం సురక్ష బీమా యోజన, పీఎం జీవనజ్యోతి బీమా యోజన అమలు కార్యాచరణలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ యోజన ద్వారా రూఫ్‌టాప్ సోలార్ యూనిట్ల ఏర్పాటుకు లబ్ధిదారులను చైతన్యపరచి దరఖాస్తు చేయించడం బ్యాంకుల ద్వారా రుణాల కల్పన, మార్జిన్ మనీ చెల్లింపు, డాక్యుమెంటేషన్ అంశాల్లో అనుసరించాల్సిన విధి విధానాలను ఆయన అధికారులకు వివరించారు. రూఫ్‌టాప్ విద్యుత్ యూనిట్ల ద్వారా లబ్ధిదారులకు ఎటువంటి రికరింగ్ వ్యయం లేకుండా నిలకడైన ఆదా, ఆదాయం చేకూరుతుందని, జిల్లాలో అర్హులైన వారందరికీ ఈ యూనిట్ల ఏర్పాటుకు బ్యాంకులు రుణాలు కల్పించాలని కోరారు. వచ్చే వారం నుంచి దరఖాస్తుల నమోదు ప్రారంభించి, త్వరితగతిన రుణాలు మంజూరు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలకనుగుణంగా పిఎం సురక్ష, పీఎం జీవనజ్యోతి యోజనల ద్వారా అర్హులైన జాతీయ ఉపాధి హామీ కూలీలను బీమా రక్షణలో నమోదు, ప్రీమియం చెల్లింపు ప్రక్రియను డ్వామా, బ్యాంకుల అధికారులు ముమ్మరంగా చేపట్టాలని కలెక్టర్ షణ్మోహన్ కోరారు. ఈ సమావేశంలో ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ జి ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ ఏ శ్రీనివాసరావు, డ్వామా పీడీ పి వెంకటలక్ష్మి, ఎల్డీఎం సీహెచ్ఎస్‌వీ ప్రసాద్, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.